'ఆటా' పోటీల్లో ఎంపికైన కథ

# కథకుని కర్తృ

-స్వర్ణ



మేఘాలు కమ్ముకోవడంతో ఉదయసూర్యుడు కనుమరుగయ్యాడు. ఎదురుచూస్తున్న చిగురాకులకు కిరణాల స్పర్శకు బదులు చీడ పురుగుల కోరల పదును తగిలింది. పరిసరాల్లో పక్షుల కిలకిలలు వినమరుగు కాగా మానవానుబంధాలు చిగురించాలంటే ఫలానా వస్తువును కొనుగోలు చేయడం ఎంత అవసరమో చాటిచెప్పే ప్రకటనలు టీవీ ఛానళ్ళలో మారుమోగుతున్నాయి.

ఇంటర్నెట్‌లో ఎంసెట్ ఫలితాలు చూస్తున్న చైతన్య ముఖం కొత్త ఎ.టి.ఎం. కార్డులా మెరిసిపోయింది. డబ్బుతో నిండుగా ఉన్న పర్సులా ఛాతీ పైకుబికింది. అతడు పార్ట్‌టైమ్ లెక్చరర్‌గా పనిచేస్తున్న కార్పొరేట్ కాలేజీకే ఈ ఏడూ రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానం దక్కింది. ఆ కాలేజీ విద్యార్థుల ఖాతాలోనే మెడికల్, ఇంజనీరింగ్ ఫస్ట్ ర్యాంకులు జమయ్యాయి. అందునా చైతన్య పనిచేస్తున్న బ్రాంచి విద్యార్థికి ఓ ఫస్ట్ ర్యాంక్ వచ్చింది. యాజమాన్యం మెచ్చి ఇవ్వబోయే ప్రత్యేక పారితోషికాన్ని తలుచుకుంటుంటే చైతన్య మనసు- వలలో జెల్ల చేప పడితే చాలనుకుంటున్న సమయంలో పులస పడ్డప్పటి జాలరి మనసులా ఉప్పొంగి పోతోంది. భార్య తెచ్చిచ్చిన కాఫీలో పంచదార తక్కువైనా ఎప్పటిలాగే కరవబోలేదు. పైగా- ''రమా! మా స్టూడెంట్‌కి ఎంసెట్‌లో స్టేట్ ఫస్ట్ వచ్చిం''దంటూ భార్యతోనూ సంతోషాన్ని పంచుకోబోయాడు. అటు గవర్నమెంట్ కాలేజీలో, ఇటు కార్పొరేట్ కాలేజీలో గొంతు చించుకుని పాఠాలు చెప్పడంవల్ల నెల తిరిగేసరికి చెరో అయిదంకెల జీతం ముడుతుంది. ఇంట్లో పెళ్ళాంతోనూ, పిల్లలతోనూ, ఇరుగుపొరుగుతోనూ కబుర్లు చెపితే ఏమొస్తుంది? అందుకే చైతన్య మామూలుగా ఎవరితోనైనా అవసరపడ్డంతవరకే అదిన్నీ- ముక్తసరిగా మాట్లాడతాడు. భర్త తన స్టూడెంట్‌కి ర్యాంక్ వచ్చిన విషయం వెలిగే ముఖంతో పనిగట్టుకుని తనతో చెపుతుంటే రమ సంబరపడిపోలేదు- లోపల నిట్టూరుస్తూ పైకి నవ్వును పులుముకుంది.

* * *

చైతన్య తండ్రి కాస్తోకూస్తో సమాజం బాగు గురించి ఆలోచించిన వాడు. స్వాతంత్ర్యోద్యమంలో సాహసించి పాల్గొన్న వాడు కాకపోయినా తనకు తోచిన సహాయం అందించిన వాడే. తన బిడ్డలకు తాతలు, ముత్తాతలు, దేవుళ్ళ పేర్లనుకాక లోకంకోసం త్యాగాలుచేసిన వారి పేర్లను, లౌకికమైన పేర్లను పెట్టుకున్నాడు. ఆయన ఆరుగురి సంతానంలో నాలుగోవాడైన చైతన్యకు మాత్రమే చదువుబాగా వంటబట్టింది. ఇద్దరు ఆడపిల్లలకు కట్నకానుకలు భారీగానే ముట్టజెప్పి పెళ్ళిళ్ళు చేసినా, నలుగురు కొడుకులకూ చెప్పుకోదగ్గ ఆస్తినే- తలో అయిదెకరాల మాగాణి- మిగిల్చాడు చైతన్య తండ్రి. వాళ్ళది చైతన్య ఇప్పుడుంటున్న నగరానికి 20 కిలోమీటర్ల దూరంలోని పల్లెటూరు. చదువబ్బని ముగ్గురన్నదమ్ములూ ఊళ్ళోనే ఉండి వ్యవసాయం చేసుకుంటుండగా, చైతన్య ఓ ప్రభుత్వ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. ఆ ఉద్యోగంలో వచ్చే జీతంకన్న ఎక్కువగా కార్పొరేట్ కళాశాలలో పార్ట్‌టైమ్ లెక్చరర్‌గా చేస్తూ సంపాదిస్తున్నాడు. సైన్స్, మ్యాథ్స్ చెప్పడంలో దిట్టకావడంతో చైతన్యలాంటి వాడికోసం కార్పొరేట్ కళాశాలలు పోటీలు పడతాయి మరి. తన బిడ్డ చైతన్యంతో సమాజానికి ఉపయోగపడే వ్యక్తిత్వాన్ని సంతరించుకోవాలన్న అభిప్రాయంతోనే చైతన్యకు తండ్రి ఆ పేరుపెట్టాడు. చైతన్య కూడా తండ్రి ఆశను వేరే కోణంలో తీర్చుకున్నాడు. లెక్చరర్‌గా, రచయితగా సమాజపు నడకకు తన వంతు చేయూతనిస్తున్నాడు. కాకుంటే తానిచ్చే దానికి ప్రతిగా సమాజంనుంచి తనకేమి ముడుతోందన్న విషయంలో కూడా ఖచ్చితమైన చైతన్యాన్ని కలిగి ఉంటాడు. అందునా, లెక్కల గుట్టుమట్టూ తెలిసిన వాడాయె! పాఠం చెప్పే ప్రతిక్షణంలోనూ అతడికి శ్రీ మహాలక్ష్మి కాలి అందెల చప్పుడు వినిపిస్తుంటుంది. మేడీజీ గైడ్లు రాసినా, కథో, కవితో రాసినా అక్షరాలకు అందబోయే పారితోషికమే నడిపిస్తుంటుంది. వారసత్వంగా వచ్చిన ఆస్తికాక సిటీలో రెండిళ్ళూ, మరో రెండు ప్లాట్లూ, లక్షల రూపాయల విలువచేసే షేర్లూ, బ్యాంక్ బ్యాలెన్సులూ ఎలా వస్తాయి మరి!

* * *

చైతన్య పనిచేసే కార్పొరేట్ కాలేజీలో దీపావళి పండుగ సందడి. బాణాసంచా కాల్చారు. మిఠాయిలు పంచారు. మెడిసిన్, ఇంజనీరింగ్‌లలో సీటు గ్యారంటీగా వచ్చే ర్యాంకులు సంపాదించిన విద్యార్థుల తల్లిదండ్రులు- ఒకటికి వంద రెట్లు లాభం హామీగా వచ్చే వ్యాపారాల్లో సొమ్ము మదుపు చేయగలిగిన వర్తకుల్లా మురిసిపోయారు. రిమోట్ కంట్రోల్‌తో సాగే ఫుట్‌బాల్ పోటీలో గోల్‌చేసిన జపనీస్ రోబోట్లలా- ర్యాంకులు సాధించిన విద్యార్థులు ముందే నిర్ణయింపబడ్డ చట్రంలో తర్వాతి గోల్‌కి సంబంధించిన కలలను కన్నారు. చూలుతో ఉన్న తన మేక ఎన్ని ఎక్కువ పిల్లల్ని కనగలదో అంచనా వేసుకునే వానిలా- కాలేజీ యాజమాన్యం తమ విద్యార్థులు సాధించిన ర్యాంకులు ఎన్ని కొత్త అడ్మిషన్లను రాబట్టగలవో లెక్కలు కట్టుకుంది. తమ సంస్థ 'దక్కించుకున్న' అనితర సాధ్యమైన విజయం గురించి వర్ణనాత్మకంగా, ఎన్ని పేజీల ప్రకటనలు ఏయే పత్రికల్లో, ఏయే ఛానళ్ళలో ఇవ్వాలో, ప్రచారం నిమిత్తం ఎంత ఖర్చుపెడితే కాలేజీ వ్యాపారం ఎంత పెరగగలదో కూడికలూ, తీసివేతలూ వేసుకుంది. రేపటి పంటకు ర్యాంకుల విత్తులు నాటిన లెక్చరర్లకు అదనపు ముడుపులను సంతోషంగా సమర్పించింది.

* * *

స్కూటర్ స్టాండ్ వేసి ఇంట్లోకి వచ్చిన చైతన్యకు హాల్లో టీవీ

చైతన్య తండ్రి కాస్తోకూస్తో సమాజం బాగు గురించి ఆలోచించిన వాడు. స్వాతంత్ర్యోద్యమంలో సాహసించి పాల్గొన్నవాడు కాకపోయినా తనకు తోచిన సహాయం అందించిన వాడే. తన బిడ్డలకు తాతలు, ముత్తాతలు, దేవుళ్ళ పేర్లను కాక లోకంకోసం త్యాగాలు చేసిన వారి పేర్లను, లౌకికమైన పేర్లను పెట్టుకున్నాడు.

చూస్తూ కూర్చున్న అన్న భగత్ కనిపించాడు. ఒకే పేగు తెంచుకు పుట్టిన బిడ్డలైనా- భగత్ దోమపోటు సోకిన వరి మొక్కలా ఉన్నాడు. చైతన్య ఏపుగా పెరిగిన వర్జీనియా పొగాకు మొక్కలా ఉన్నాడు. 'వీడెందుకు వచ్చాడో?' లోపల మనసు చిట్లించుకుంటూనే, పైకి నవ్వాడు పలకరించాడు చైతన్య.

''ఎప్పుడొచ్చావ్?''

''సాయంత్రమే వచ్చా. కొంచెం పనుంది. నీతో మాట్లాడి లాస్ట్ బస్‌కి వెళ్ళిపోదామని ఆగా.''

''ఏం పని?''

''రేటు రాలేదని ధాన్యం ఇంకా అమ్మలేదు. సార్వా పెట్టుబడులకు డబ్బవసరం. పదివేలు సర్దుతావేమోనని. ధాన్యం అమ్మగానే తిరిగి ఇచ్చేస్తాను'' భగత్ సంకోచంగానే వచ్చిన పని చెప్పాడు.

జవాబిచ్చేందుకు చైతన్యకు క్షణం కూడా పట్టలేదు. ప్యాంట్ జేబులో కాలేజీ యాజమాన్యం ఇచ్చిన బహుమానంతో బరువుగాఉన్న కవరుంది. అప్రయత్నంగా ఆ జేబుమీద చేయివేసి అదిమి పెడుతూ.

''కష్టమన్నయ్యా. మొన్ననే ఇంటి స్థలంకొన్నాను. డబ్బు సర్దుబాటుకాక నాకే అవస్థగా ఉంది''. అన్నాడు.

'ఎలాగోలా సర్దుబాటు చేయరా!'అని మరోసారి అడుగుదామన్న ఆరాటాన్ని అణచి పెట్టుకున్నాడు. భగత్. తమ్ముడి తత్వం తెలుసు. అయినా అవసరం తనది గనుక ప్రయత్నించాడు. 'ఈ రాయి ఇక మెత్తబడదు' అని నిశ్చయించుకుని-

''వస్తారా! ఇప్పుడెళితే 9 గంటల బస్సు దొరుకుతుంది'' అంటూ లేచాడు.

''ఎలాగూ ఇప్పటివరకూ ఉన్నావుగా- భోంచేసి వెళ్ళరాదూ?'' లాంఛనంగా అన్నాడు చైతన్య.

''లేదులే. వదినా, పిల్లలు ఎదురు చూస్తుంటారు. వస్తానమ్మా రమా! వస్తానా!'' బయటికి నడిచాడు భగత్. సాగనంపడానికన్నట్టు వాకిలి వరకూ వెళ్ళాడే తప్ప స్కూటర్ మీద బస్టాండ్‌కి తీసుకువెళతాననలేదు చైతన్య.

తిరిగి లోనికి వచ్చి సోఫాలో కూర్చుని ఈసడింపుగా అనుకున్నాడు. ఉమ్మడి ఇంట్లో నా వాటా కొనుక్కుని రెండేళ్ళయింది. దాని తాలూకు బకాయే ఇంకా ఇవ్వకుండా ఇదిగో, అదిగో అంటున్నాడు. సిగ్గు లేకుండా మళ్ళీ పదివేలు కావాలని అడగడానికి తయారయ్యాడు. ఇంకా నయం, నా పొలంకూడా తానే కౌలుకు చేస్తానని అడిగినప్పుడు సొంత అన్న కదా అని ఇవ్వలేదు. ఇచ్చి ఉంటే కౌలు డబ్బులకూ అదే గతి పట్టి ఉండేది. ఆ రంగారావుకు ఇచ్చాను గనుక, ప్రతి ఏడాదీ కౌలు డబ్బులు ఖచ్చితంగా చేతికి అందుతున్నాయి. అవును- ఆ రంగారావు కూడా ఈమధ్య గాడి తప్పాడు. నిరుటి కౌలులో కొంత బకాయి పెట్టాడు. ఈ ఏటి కౌలు ఇంకా ఇవ్వలేదు. పోనీ, రైతును మార్చేద్దామా అంటే ఊళ్ళో అంతా లిటిగెంట్లే. ఇన్నాళ్ళు వ్యవసాయం చేశాం, దీనిలోంచి కదలం. అమ్మితే మాకే అమ్మాలి అనే పేచీకోరులే ఎక్కువ. కొందరైతే, అసలు పొలంపై హక్కే మాదని అడ్డంతిరిగి కోర్టులకెక్కి అసలు యజమానులను ముప్పుతిప్పలు పెట్టిన వాళ్ళున్నారు. రంగారావు అలాంటి బాపతు కాదు. సత్తెకాలపు మనిషి. అందుకే రైతును మార్చాలంటే జంకాల్సి వస్తోంది.

''రమా! ఈ కవర్‌లో ఇరవై వేలున్నాయి. బీరువాలో ఉంచు. రేపు బ్యాంక్‌లో వేస్తాను.''

కవరందుకుంటున్న రమకు- భర్త డబ్బు లేదనడంతో తాలు గింజలా మారిన బావగారి ముఖం గుర్తుకు వచ్చింది. 'ఈ మనిషింతే. డబ్బు మీద తప్ప మరి దేనిమీదా ఆపేక్ష ఉండదు' అనుకుంటూ నిట్టూర్చింది. చైతన్యతో పెళ్ళి కుదిరినప్పుడు తానెంత మురిసిపోయిందీ గుర్తుకు వచ్చింది.

* * *

'కుర్రాడు చాకులా ఉన్నాడు. చక్కటి ఉద్యోగం ఉంది. కుటుంబం మంచిది. ఇంకేమీ ఆలోచించే పనిలే'దనుకున్నారు రమ తల్లిదండ్రులు. రమకప్పుడు 19 ఏళ్ళు. డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. లోకం బాగోలేదనీ, దాన్ని మరమ్మతు చేయాల్సిన అవసరం ఉందనీ ఆవేశపడేది. సాహిత్యమంటే మక్కువ. సాహిత్యాన్ని సృష్టించే వాళ్ళు ప్రత్యేకంగా, అపురూపంగా కనిపించేవారు. లోకం బాగుచేతకు సాహిత్యం గొప్ప సాధనమనుకునేది. రచయితలు సమాజంలోని అందరికన్న స్వచ్ఛమైన మనుషులనీ, అభ్యుదయ యాత్రకు మార్గదర్శకులనీ నమ్మేది. తానూ తన ఆవేశానికీ, ఆవేదనకూ అనుగుణంగా కవితలు రాసేది. పత్రికలకు పంపేది. ఎక్కడా అచ్చుకాకపోయినా- తమ కాలేజీ మ్యాగజైన్‌లో అచ్చయినప్పుడు మురిసిపోయేది. దానికే తానేదో సాధించానని ఉప్పొంగిపోయేది. చైతన్య సంబంధం వచ్చినప్పుడు రమ మొదట్లో వద్దంది. తాను అప్పుడే పెళ్ళి చేసుకోనంది. తన ఆశయాలకోసం చేయాల్సింది చేశాకనే పెళ్ళి చేసుకోవాలన్నది రమ ఉద్దేశం. అయితే ఆ విషయం చెప్పే చొరవ లేనిది గనుక తనకింకా చదువుకోవాలని ఉందంది. అయితే చైతన్య రచయిత అని తెలిశాక ఆమె నిర్ణయం మారిపోయింది. మంచి ఉద్యోగస్తుడని చైతన్యకు ఆమె తల్లిదండ్రులు మార్కులు వేయగా- రమ మాత్రం రచయిత అయినందుకు, తన రచనల్లో మంచి అభిప్రాయాలను వ్యక్తం చేసినందుకు నూరు మార్కులు వేసింది. పెళ్ళిచూపులకు ఒప్పేసుకుంది. అయితే ఆదర్శ భావాలను కలిగిన రచయితతో పెళ్ళికి కూడా కట్నకానుకల ప్రస్తావన వచ్చినప్పుడు నివ్వెరపోయింది. పెళ్ళిచూపులప్పుడు చైతన్యతో విడిగా మాట్లాడేటప్పుడు అదే అడిగింది.



"రేటు రాలేదని ధాన్యం ఇంకా అమ్మలేదు. సార్వా పెట్టుబడులకు డబ్బవసరం. పదివేలు సర్దుతావేమోనని. ధాన్యం అమ్మగానే తిరిగి ఇచ్చేస్తాను"
"కష్టమన్నయ్యా. మొన్ననే ఇంటి స్థలం కొన్నాను. డబ్బు సర్దుబాటుకాక నాకే అవస్థగా ఉంది"

''మీరేమీ అనుకోనంటే ఒక్క విషయం చెపుతాను. మీ రచనల్లో గొప్ప భావాలు కనిపిస్తాయి. కానీ, మీవైపునుంచి కట్నం అన్న మాట వస్తోందేమిటీ?''

చైతన్య అందంగా నవ్వాడు. అతడికి రమ నచ్చింది. అంత మాత్రాన కట్నం లేని పెళ్ళికి అతడు సిద్ధంగా లేడు. రాసే రాతలేమైనా తాను ప్రాక్టికల్ మనిషి. మానవ జీవితం డబ్బుతో ఎంతగా పెనవేసుకుపోయిందో తనకు తెలుసు. అందుకే రమ సంబంధం చేసుకుంటే వాళ్ళెంత ముట్టజెప్పగలరో ముందే తెలుసుకున్నాడు. తనకు వచ్చిన మిగతా సంబంధాలను పోల్చి చూసుకున్నాడు. ఆ అమ్మాయిల అందాలనూ, వారిని చేసుకుంటే రాగల కట్నకానుకలనూ బేరీజువేసుకున్నాడు. రమను చేసుకుంటేనే అన్ని విధాలా లాభసాటి అని నిర్ణయించుకున్నాకనే పెళ్ళిచూపులకు తరలి వచ్చాడు.

రమ కట్నం గురించి ప్రశ్నించగానే 'ఈ అమ్మాయి ఏదో ఆదర్శాల పిచ్చిలో ఉన్నట్టుంది' అనుకున్నాడు. అయితే నేరుగా తాను కట్నం తీసుకోవడానికి వ్యతిరేకిని కానని చెపితే ఆవేశపడి ఎక్కడ ఈ సంబంధం వద్దంటుందోనని తన చాతుర్యాన్ని ప్రదర్శించాడు.

''ఇద్దరు వ్యక్తులు బతుకుల్ని ముడి వేసుకునేటప్పుడు కట్నకానుకలు కాదు. పరస్పరం ఒకరిపై ఒకరికి ఇష్టం. కలిసే అభిప్రాయాలు, ఎదుటి వారి లోపాలను సైతం సహించే ఓరిమీ ఇవీ ముఖ్యం. ఇవన్నీ నాకు తెలుసు. మరి, మా వాళ్ళు కట్నం ప్రస్తావన చేయడమంటావా- నాకు కట్నం అవసరంలేదు. అందుకని అడిగే ప్రసక్తిలేదు. కానీ, మీ వాళ్ళు ఉన్నవాళ్ళే. వాళ్ళు తాము ప్రేమించే బిడ్డకు తామివ్వదలచుకుంది ఇస్తే కాదనడమూ ధర్మంకాదు. మీ వాళ్ళు నీకు ఇవ్వాలనుకున్నది ఇస్తారు. దానికి కట్నం పేరుపెట్టి మరో రకంగా అనుకోవడం దేనికి? దానికోసం మా వాళ్ళు డిమాండ్ చేయకుండా నేను చూస్తానుగా. ఇక ఆ గోల విడిచిపెట్టి అసలు విషయం చెప్పు. నేను నీకు నచ్చానా, లేదా? కలిసి బతకాల్సింది మనమిద్దరమే కదా! మనకు ఆనందాన్నిచ్చేది మనసుల్లో ఒకరిపై ఒకరికి ఉండే ఆపేక్ష తప్ప మన పేరిట ఉండే ఆస్తిపాస్తులు కావు. వాటిని మనకు మనం సంపాదించుకోవాలి తప్ప అప్పనంగా వచ్చే వాటికి ఆశించడం వ్యక్తిత్వంకాదు. ఏమంటావ్?''

రమ మురిసిపోయింది. చైతన్య లోకంలోకెల్లా అందమైన యువకుడిగా, ఆదర్శ వ్యక్తిత్వం కలవాడిగా కనిపించాడు. 'చైతన్య అన్నట్టు ఆ కట్నం గోల పాతకాలపు ముసలి భావాల పెద్దవాళ్ళకే విడిచి పెట్టేస్తే పోలా? నాకివ్వాలనుకున్నది నాన్న ఎలాగూ ఇస్తాడు. దానికి కట్నమనే పేరు పెట్టడం దేనికి?'అనుకుని చైతన్యతో చెప్పింది-

''మీరు నాకు నచ్చారు.''

సంబంధం కుదిరిపోయింది. రమ ఆదర్శ దాంపత్యం గురించి కలలు కననారంభించింది. పెళ్ళయిన కొద్దిరోజులకే చైతన్య అందం చర్మానికే పరిమితమని రమకు తెలిసి వచ్చింది. అతడి రాతలు బతుకుతెరువుకు సంబంధించిన ఒకానొక చాతుర్యమే తప్ప వాటికి ఆత్మలేదనీ, సంస్కారానికి సంబంధించిన అతడి మాటలు పెదవుల నుంచి వచ్చేవే తప్ప వాటికి హృదయ స్పర్శలేదనీ తెలిసిపోయింది.

(మిగతా 12వ పేజీలో)

(9వ పేజీ తరువాయి)

చైతన్య- రుతుశోభలను చూసి పరవశించాల్సిన వేళ ఏ పువ్వు కడుపులో ఎక్కువ తేనె జుర్రుకోవచ్చో లెక్కలు కట్టుకునే తెలివైన కీటకంలాంటి వాడని రుజువైనా చేసేది లేక సర్దుకుపోవడం అలవాటు చేసుకుంది.

★ ★ ★

ఆరోజు చైతన్యకు సెలవుకావడంతో ఇంటి పెరట్లో తిరుగుతున్నాడు. దాదాపు 500 గజాల పెరట్లో రకరకాల మొక్కలున్నాయి. అవన్నీ అంతకుముందు ఆ ఇంటి యజమానులుగా ఉన్నవాళ్ళు వేసినవే. ప్రస్తుతం చైతన్య ఇంటిని పడగొట్టి అపార్ట్‌మెంట్స్ కట్టించాలన్న ఆలోచనలో ఉన్నాడు. విశాలమైన పెరడు గుడ్లు పెట్టడానికి సిద్ధంగా ఉన్న బంగారు బాతులా కనిపిస్తోంది చైతన్యకు.

"రమా! ఈ రామాఫలం చెట్టు ఆకులెందుకో వడిలిపోతున్నాయి. ఏమై ఉంటుందో? ఎంచక్కా నాలుగేళ్ళుగా బోలెడు కాయలు కాసింది. దీని వాలకం చూస్తుంటే చచ్చిపోతుందో, ఏమిటో? అగ్రికల్చరల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే మా ఫ్రెండ్‌ని సలహా అడుగుతాను గానీ, నువ్వు మాత్రం విడవకుండా నీళ్ళుపోస్తుండు." చైతన్య ఆ ఇంటిని కొనేటప్పుడు పెరట్లోని రమాఫలం చిన్న మొక్క. తర్వాత ఏపుగా పెరిగి నాలుగేళ్ళుగా విరగకాసింది. వాడిపోతున్న ఆ చెట్టును చూసి చైతన్య దిగాలుపడ్డాడు.

వ్యవసాయ శాఖలో పనిచేసే మిత్రుడిని తీసుకువచ్చి చెట్టును చూపించాడు. చెట్టు మొదట్లో చెద పట్టిందని గమనించిన ఆ మిత్రుడు చుట్టూ బోదె చేసి ఫలానా రకం గుళికలు వేయమని సలహా ఇచ్చాడు.

"ఎంతవుతుంది?"

"రెండొందలుండొచ్చు" చెప్పాడు మిత్రుడు.

"గుళికలు వేస్తే చావకుండా బతుకుతుందంటారా?"

"వేసి చూడండి, చాలావరకు ఫలితం ఉండవచ్చు. అయితే హండ్రెడ్ పర్సంటని చెప్పలేం."

మిత్రుడు వెళ్ళిపోయాక ఆలోచించాడు చైతన్య. 'రెండొందలు ఖర్చుపెట్టినా బతికే హామీలేనప్పుడు అనవసరంగా ఖర్చుచేయడం దండుగ. ఎలాగూ అపార్ట్‌మెంట్‌లు కట్టించేటప్పుడు ఈ చెట్లన్నింటినీ కూలగొట్టించాల్సిందే కదా! దీన్ని బతికిస్తే మహాఅయితే ఇంక ఒకటి రెండు కాపులు కాస్తుంది.'

ఇంతలో కౌలు రైతు రంగారావు వచ్చాడు. కాయబారిన ఒంటితో, కమిలిన ముఖంతో వడిలిపోతున్న రామాఫలం చెట్టు లాగే ఉన్నాడు. అతడు మోసుకొచ్చిన కొబ్బరికాయలూ, అరటిపళ్ళ గెలా, మామిడి పళ్ళూ చూడగానే ముఖమింతైనా 'కౌలుడబ్బులు పట్టుకొచ్చాడో, లేదో?' అనుకున్నాడు చైతన్య.

"ఏమయ్యా రంగారావ్! ఏంటి విశేషం?" అడిగాడు.

"ఏం లేదండీ- మందుకట్టలూ, పురుగు మందులూ పట్టుకెళ్లడానికొచ్చాను. ఓసారి మీకు కనబడి పోదామనొచ్చా."

'అంతే తప్ప డబ్బులివ్వడానికి కాదన్నమాట. నువ్వు కూడా మా అన్నలాగే తయారవుతున్నావు కదరా! అయినా అదిలించకపోతే లాభం లేదు' అనుకుంటూ-

"బకాయి మాటేం చేశావు?" అడిగాడు.

"రెండేళ్ళుగా కలిసి రావడం లేదండీ. దిగుబడులూ బాగాలేవు. రేటూ ఉండడం లేదు. కొంచెం ఒడిదుడుకుల్లో పడ్డాను. ఈ పంట రాగానే ఇచ్చేస్తాను." సిగ్గుపడుతూ చెప్పాడు రంగారావు.

"అది సరేగానీ, ఈ రామాఫలం చెట్టు చూడు. చావు ముఖం పెట్టింది. ఎవర్నో సలహా అడిగితే మొదట్లో గుళికలు వేయమన్నారు." అంటూ రైతును పెరట్లోకి తీసుకువెళ్ళాడు. ఆ సమయానికి కాఫీ పుచ్చుకుని రంగారావుకివ్వడానికి వచ్చింది రమ. ఆమెను చూడగానే చైతన్య 'అసలే డబ్బులు బకాయిపెట్టిన వాడికి ఈ కాఫీ ఒకటి దండుగ' అనుకుంటున్నట్టు నొసలు చిట్లించాడు.

చెట్టును పరిశీలనగా చూసిన రంగారావు "ఏం గుళికలు వేయమన్నారు?" అనడిగాడు. చైతన్య చెప్పాడు.

"అవా- నేనిప్పుడే ఈ రకం గుళికలు కొన్నాను. నలు



ఇంతలో కౌలు రైతు రంగారావు వచ్చాడు. కాయబారిన ఒంటితో, కమిలిన ముఖంతో వడిలిపోతున్న రామాఫలం చెట్టు లాగే ఉన్నాడు. అతడు మోసుకొచ్చిన కొబ్బరికాయలూ, అరటిపళ్ళ గెలా, మామిడి పళ్ళూ చూడగానే ముఖమింతైనా 'కౌలుడబ్బులు పట్టుకొచ్చాడో, లేదో?' అనుకున్నాడు చైతన్య.

గురు రైతులూ కలిసి ట్రాక్టర్‌లో వేసుకెళ్ళొచ్చని కొట్లోనే ఉంచాను. అర కేజీయేగా- పట్టుకొస్తానుండండి" అంటూ వెళ్ళాడు. అరగంటలోనే గుళికలు పట్టుకొచ్చాడు. గునపం లేకున్నా ఒక ఊచతో చుట్టూ లోతుగా పాదుచేసి గుళికలు వేసి కప్పెట్టాడు. అతడి ఒంటి నుంచి ధారలుగా కారిన చెమటతో మట్టీ, చెట్టు వేళ్ళూ, గుళికలూ తడిశాయి. పని పూర్తయేసరికి గంటన్నర పట్టింది.

"వస్తానండీ- అవతల ట్రాక్టర్ వచ్చేసుంటుంది." అంటూ వెళ్ళిపోయాడు రంగారావు.

'పోనీలే -వీడు కౌలు బకాయికి ఎలాగూ వడ్డీ ఇవ్వడు. ఈ గుళికల ఖర్చయినా కలిసొచ్చింది. అంతే కాదు -ఈ పనికి ఈ సిటీలో కూలీని పిలిస్తే వాడో వంద లాగేసి ఉండేవాడు' లెక్కకట్టుకున్న చైతన్య సంతోషించాడు.

★ ★ ★

రామాఫలం చెట్టు నానాటికీ వాడిపోయి, ఎండిపోయి చివరికి చచ్చిపోయింది. ఫిక్స్‌డ్ డిపాజిట్ రసీదును పోగొట్టుకున్నట్టు చైనత్యకు బాధేసింది. 'బతికి ఉంటే మరో రెండేళ్ళు కాసి ఉండేది. అర్థాంతరంగా చచ్చిపోయిందే! అనవసరంగా గుళికలు కూడా వేయించానే! ఇప్పుడు దీన్ని కొట్టించడానికో ఖర్చు. ఆ రంగారావు కౌలు డబ్బులు పట్టుకొచ్చినప్పుడు వాడిచేతే కొట్టించొచ్చు.'

రెండునెలలు గడిచినా రంగారావు రాలేదు. నరికిన చెట్టును ఇచ్చేసి, 50 రూపాయలు చెల్లించేలా కూలీని మాట్లాడి చెట్టు కొట్టించేశాడు చైతన్య. 'పోతే పోయిందిలే- రేపు అపార్ట్‌మెంట్స్ కట్టించేటప్పుడైనా కొట్టించాల్సిందే' అనుకుని సరిపెట్టుకున్నాడు.

'పచ్చగా, కళకళలాడుతూ నిండుగా ఉండేది. ఎండాకాలం దాని నీడలో నిలబడితే అమ్మ ఒళ్ళో ఉన్నట్టు చల్లగా, హాయిగా ఉండేది. పెరడంత బోసిపోయిందో.' ఆత్మీయురాలిని కోల్పోయినట్టు రమ బెంగటిల్లింది.

★ ★ ★

ఊరినుంచి కబురొచ్చింది. రంగారావు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కారణం- అప్పుల బాధ. ఆ చావు కబురుతో చైతన్య గతుక్కుమన్నాడు. కోతకొచ్చిన వరి చేను ఊహించకుండా వచ్చి పడ్డ తుఫానుతో ధ్వంసమైనప్పుడు రైతు పడే బాధలాంటిది కలిగింది. 'పాత బకాయీ, తాజా కౌలూ కలిపి దాదాపు పాతికవేల రూపాయలు- హుష్‌కాకీ అయినట్టే. ఎంతో మంచివాడనుకునే రంగారావు ఎంత ద్రోహంచేశాడు. చచ్చిన రైతుల కుటుంబాలకు గవర్నమెంట్ ఇచ్చే డబ్బులు కూడా ఈ రంగారావు కుటుంబానికి వచ్చి తగలడవు. వీడేమో కౌలు రైతాయె. ఇక ఆ డబ్బులు ఎవరిస్తారు? చేతికి అందాల్సిన సొమ్ముకు రెక్కలొచ్చి ఎగిరిపోయినట్టే!' రంగారావు పదేళ్ళకు పైబడి చైతన్య పొలం సాగుచేశాడు. ఈమధ్య తప్ప ఎప్పుడూ పంట అమ్మగానే కౌలు డబ్బు ఖచ్చితంగా తెచ్చిచ్చేవాడు. చేలో, గట్టునా ఏమి కాయకాసినా, పండు పండినా పనిగట్టుకుని మోసుకొచ్చేవాడు. అవన్నీ చైతన్యకు గుర్తురాలేదు. రంగారావు ఇవ్వాల్సిన సొమ్ము ఇక రాదన్న నిజమే వెంటాడుతూ నొప్పిస్తోంది. ఒకటా, రెండా పాతికవేలు. ఈ నష్టాన్ని భర్తీచేసుకోవడం ఎలా? బుర్రపాడైంది. రమ మీద నిష్కారణంగా నోరు చేసుకున్నాడు. తనలోతానే మథనపడ్డాడు. నష్టపరిహారం చెల్లింపును కౌలు రైతులకు వర్తింపజేయని ప్రభుత్వాన్ని తిట్టుకున్నాడు.

'ఎప్పుడూ వట్టిచేతుల్తో వచ్చేవాడు కాదు. అమ్మగారూ, అమ్మగారూ అంటూ వచ్చినప్పుడల్లా ఎంత అగ్గగ్గలాడిపోయే వాడో. చివరికి రంగారావు బతుకిలా ముగిసిందా!' రమలో ఆత్మీయుడిని కోల్పోయినప్పటి వెలితి!

★ ★ ★

నాలుగురోజులు గడిచాయి. కాఫీ తాగుతూ వీక్లీ తిరగేస్తున్నాడు చైతన్య. కథల పోటీ ప్రకటన కంటబడింది. మొదటి బహుమతి ఎంతో చూశాడు. 'ఈ మొత్తం ఏదో బాగానే ఉంది. వెంటనే కథ పంపాలి' అనుకున్నాడు. 'ఏ సబ్జెక్టుమీద రాస్తే బహుమతి కొట్టెయ్యొచ్చు?' ఆలోచనలు పరిగెత్తాయి. రంగారావు చావువల్ల వచ్చిన నష్టం గుర్తుకొచ్చింది. 'వాడి కథనే రాస్తే పోలా! అవును, కష్టాన్ని నమ్ముకున్న రైతుకు కష్టానికి తరుముతున్న వ్యవస్థను దుమ్మెత్తిపోస్తూ బోలెడంత రాయొచ్చు. తిండి పెట్టేవాడికి అకాలంగా పిండం పెట్టే పరిణామాలకు మూలమైన ఆర్థిక సంస్కరణలపై విరుచుకు పడవచ్చు. రైతుల బతుకువెతలను వర్ణించి ఎంతో కరుణను గుప్పించవచ్చు. రైట్! విత్తనం రెడీ. ఇక ఏరువాక సాగి కొత్త కథా సేద్యానికి శ్రీకారం చుట్టవచ్చు. చచ్చిపోతున్న రైతుల్లో ఎక్కువమంది పురుగుల మందు తాగుతున్నారు. కొందరు ఉరేసుకుంటున్నారు. వెరైటీగా ఉంటుంది. అందరి కడుపాకలికీ అన్నం ఇచ్చే రైతు నాగరి కర్రుతో పొట్టలో పొడుచుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు రాస్తా. ఫస్ట్‌ప్రైజ్ వచ్చే ఛాన్సూ పెరుగుతుంది. తుఫాను తెచ్చిపెట్టిన పంట నష్టానికి అనుకోకుండా ఇన్సూరెన్స్ సదుపాయం లభించినట్టు చైతన్య మనసు తెరిపిన పడింది.

★